ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు




మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలి

5లో

- రేపు మండల కేంద్రాల్లో ఆందోళనలు
- పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న రైతుసంఘం

ఉప్పు, పప్పు, కారం అన్నీ కల్తీనే!

- ప్రజారోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- తూనికలు, కొలతల్లోనూ మోసాలు
- అంతంత మాత్రంగానే తనిఖీలు



4లో

ముందస్తు ఖరీఫ్‌కు రైతుల సన్నద్ధం



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఏడాది ముందస్తు ఖరీఫ్ ప్రారంభం కానుంది. రుతు పవనాలు ముందుగానే వస్తాయన్న సమాచారంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. సాధారణంగా జూన్ మొదటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. ప్రతి ఏటా వర్షాలు ఆలస్యం కారణంగా జులైలో కానీ వ్యవసాయ పనులు ప్రారంభం కావడంలేదు. ఈ ఏడాది పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. వేసవి తీవ్రత కొనసాగుతున్నా వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పుల వల్ల అదపాదడపా భారీ వర్షాలు కూడా కురుస్తున్నాయి. దీంతో ముందస్తు ఖరీఫ్‌కు అవకాశాలు ఉన్నాయి.

అయితే ప్రభుత్వం ఇంత వరకు సబ్సిడీ విత్తనాల సరఫరాపై దృష్టి సారించలేదు. ఈ ఏడాది రైతులకు సబ్సిడీ

సబ్సిడీ విత్తన సరఫరాలో జాప్యం

విత్తనాలపై అధికారులు ఇండెంట్ పెట్టినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల సంకేతాలు రాలేదు. ప్రధానంగా వరి, మినుము, పెసర, జనుము, కంది, జొన్న, మొక్కజొన్న, తదితర విత్తనాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాల నుంచి కొంత వరకు కొనుగోలు చేస్తారు. పచ్చిరొట్ట విత్తనాలు కూడా గతేడాది నిల్వలు కొంత వరకు అందుబాటులో ఉన్నా పూర్తి స్థాయిలో సరఫరా లేదు. జిల్లాలో భూసారాన్ని పెంచేందుకు 1700 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. పిల్లిపెసర విత్తనాలు 50 శాతం సబ్సిడీతో కిలో రూ.90కి ఇవ్వనున్నట్టు ప్రకటించినా పూర్తిస్థాయిలో సరఫరా జరగలేదు. చౌడు భూముల్లో ముందస్తుగా జిప్సం, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు వాడి భూసారాన్ని పెంచుకునేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

జిల్లాలో గతేడాది 3.13 లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో సాగవుతుందని అంచనా వేయగా కేవలం 2.40 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. డెల్టా పరిధిలో 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 55 వేల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో మిర్చి, 6500 ఎకరాల్లో మినుము, 3200 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి, మినుము, పసుపు, జూట్, సోయాబీన్, కంది,

2లో

'దేశ సమాఖ్య వ్యవస్థ - ఎదురవుతున్న సవాళ్లు'పై నేడు స్మారకోపన్యాసం

హాజరుకానున్న మాడభూషి శ్రీధర్

ప్రజాశక్తి - విజయవాడ : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తొలి పార్లమెంటు ప్రతిపక్షనేత, స్వాతంత్ర సమరయోధుడు అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆడిటోరియంలో స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబివికె మేనేజ్‌మెంట్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 'భారతదేశ ఫెడరల్ వ్యవస్థ - ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సీనియర్ పాత్రికేయులు, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది, న్యాయశాస్త్ర ఆచార్యులు, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంబివికె ట్రస్టు ఛైర్మన్ పి.మధు, ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రాయపాటి శైలజ నేడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన రాయపాటి శైలజ సోమవారం మంగళగిరి వద్ద కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల ఆమెకు చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

సెలవుపై ఎస్‌పి సతీష్‌కుమార్

బాపట్ల ఎస్‌పి తుషార్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ వారం రోజులపాటు సెలవుపై కుటుంబ సభ్యులతో కలిసి స్వస్థలం తమిళనాడు వెళ్తుండంతో బాపట్ల జిల్లాకు గుంటూరు జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌పి సతీష్‌కుమార్ సెలవుపై ఆదివారం వెళ్లారు. 25న తిరిగి రానున్నారు. గతంలో తుషార్ దూడి ఎనిమిది నెలలు పాటు జిల్లా ఎస్‌పిగా పనిచేశారు. తరువాత బదిలీపై బాపట్ల వెళ్లారు.

ముందస్తు ఖరీఫ్‌కు రైతుల సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఇతర కూరగాయల పంటలను సాగు చేశారు. అయితే గత ఆగస్టు 31న వచ్చిన ఆకాల వర్షాల వల్ల జిల్లాలో దాదాపు 42 వేల ఎకరాల్లో పైర్లకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఈఏడాది రైతులకు ఎక్కువ మంది పంట మార్పిడి దిశగా అడుగులు వేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వినియోగంతో వెదపద్ధతిలో వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుండటంతో వరి విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మినుము, కంది, పెసర, మినుము సాగుకు ప్రభుత్వం మేలు రకం విత్తనాలు సరఫరా చేస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతానికి పచ్చిరొట్ట విత్తనాలు జీలువు, జనుము, పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేస్తున్నామని సాధారణ సాగు కోసం విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపామని అధికారులు తెలిపారు. ఎపి సీడ్స్‌నుంచి రాగానే త్వరలో విత్తనాలు అందిస్తామని చెబుతున్నారు.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సిఐ వినోద్ కుమార్

రోడ్డు భద్రత నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు : సిఐ వినోద్

ప్రజాశక్తి - మంగళగిరి

ద్విచక్ర వాహన చోదకులు, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణం చేసే వారు విధిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని మంగళగిరి పట్టణ సీఐ డి వినోద్ కుమార్ సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జరిమానాలను వసూలు చేసేందుకు సీఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్లో ఆదివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించకుండా రాకపోకలు సాగించిన వారికి జరిమానా విధించడం జరిగిందని గతంలో విధించిన ఈ జరిమానాలను కట్టకుండా తిరిగే వారి వద్ద నుంచి వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన, జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది కేవలం నిబంధనలు పాటించకపోవడం కారణంగానే ప్రాణాలను విడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన కుటుంబానికి కన్నీటి వ్యథ మిగులుతుందని, వాహన ప్రయాణం చేసేముందు కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ ఎస్ఐ నాయక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండలు భగభగ - మీటరు గిరగిరా

- రోజుకి 40 మిల్లియన్ విద్యుత్ యూనిట్లు అదనపు వినియోగం
- నియోజకవర్గ స్థాయిలో రోజుకు 120 మిలియన్ యూనిట్లకు పైగానే
- పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోను, నియోజకవర్గ స్థాయిలోను ఎండలు భగ, బగ మంటు న్నాయి. విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో విద్యుత్ మీటరు గిరగిరా తిరుగుతున్నాయి. సహజంగా పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా కేటాయింపులు లేక పోవడంలో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తు తున్నాయి. మరి కొన్ని చోట్ల అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. సరఫరాలో అంతరాయాలకు సాంకేతిక సమస్యలే కారణమని, త్వరిత గతిన పరిష్కరించి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ దికారులు చెప్పుకొస్తున్నారు. నియోజక వర్గంలో రోజు వారీ గా విద్యుత వినియోగం 80 మిలియన యునిట్లగా ఉంటోం దని విద్యుత్ అధికారులు చెప్తున్నారు. అయితే ఫిబ్రవరి నుంచి రోజు వారి వినియోగం 90నుంచి 100 మిలియన్ యూనిట్లుగా ఉంటోందని విద్యుత్ శాఖాధి కారులు చెప్త న్నారు.



అదనంగా 40 మిలియన్ యూనిట్లుగా ఉంది. దీంతో మొత్తం లక్ష ఇరవై వేల మిలియన్ యూనిట్లగా వాడకం వస్తోందంటున్నారు. వాడకం ఒక్క సారిగా పెరిగితే మినీ ట్రాన్స్‌ఫారాలు భరించలేవని మధ్య మధ్యలో పేలిపోవటం నిప్పురవ్వలు రావటం జరగడానికి ప్రధాన కారణాలని విద్యుత్ ఉద్యోగులు అంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో మొత్తం విద్యుత్ కనెక్షన్న లక్ష నలబై వేల కనెషన్లు ఉన్నాయి. సాధారణంగా ఎండాకాలంలో విద్యుత్ కేటాయిం పులు కొంత ఎక్కువగానే ఉంటుంది. అయితే సాగు విస్తీర్ణం తగ్గుతుందన్న నెపంతో కేటాయింపులు తగ్గించినట్లు ఆయా వర్గాల ద్వారా తెలు స్తోంది.

డిఈఈ వై.ఏడుకొండలు మాట్లాడుతూ వేసవి నేప థ్యం లో నియోజకవర్గ స్థాయిలో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. గతేడాది వినియోగాన్ని అంచనా వేసుకుని ముందుగానేప్రణాళికలుసిద్ధం చేసుకున్నామనీ, ఆ మేరకు అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచామన్నారు.

పూల వ్యాపారి శ్రీను మాట్లాడుతూ బెంగళూరు నుంచి ప్రత్యేకంగా శుభకార్యాల మొత్తం పూలను తెప్పిస్తూ ఉంటామని వాటిని చల్లటి వాతావరణంలో ఉంచితే ఎక్కువ కాలం వస్తాయని విద్యుత్తు కోతల వల్ల పూలు వరబడిపోయి నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. రోజులో ఏదొక సమ యంలో విద్యుత్ సరఫరా లిపోతోందన్నారు. అధికారు లు స్పందించి నిరంతరం నాణ్యమైన, కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటవర్తి రాంబాబు, విశిష్ట అతిథిగా రాష్ట్రప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు పాల్గొన్నారు. రాంబాబు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు స్కాలర్షిప్‌లు ఇవ్వడం, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత వసతి కల్పించి శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు జులైలో రూ.50 లక్షలు స్కాలర్షిప్‌లు అందచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవోపా యూనిట్ల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అందిస్తున్నట్లు చెప్పారు. రాచపూడి సుబ్బారావు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు మందులు అందించడం అభినందనీయమన్నారు. అవోపా మహిళా విభాగం అధ్యక్షులు చింతా వసంత కల్పన మాట్లాడుతూ అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో త్వరలో మహిళలకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల పెన్షన్‌కు రూ.60 వేలు చలువాది ఆదినారాయణ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, మట్టుపల్లి రవికుమార్, నాళం కృష్ణకుమారి, రంగా రత్నశ్రీ, మద్ది కోటిరత్నం పాల్గొన్నారు.



పెన్షన్లు అందచేస్తున్న తటపర్తి రాంబాబు, కెవి బ్రహ్మం, అసోసియేషన్ నాయకులు

బ్రిడ్జిపై నుంచిపడి యువకుని దుర్మరణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరంలోని మణిపురం ఆర్‌వోబిపై నుంచి పడి ఆదివారం గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. అతని వయస్సు 25 నుంచి 30 ఏళ్లలోపు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. బ్రిడ్జిపై నుంచి జారిపడ్డాడా లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అరు కోణంలో పాత గుంటూరు పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతఃదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిసిన వారు



రేపటి ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20 తేదీన మూడు సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జెట్టి బాలరాజు కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 లేబర్ కోర్టులను నాలుగు కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. పంటకు గిట్టుబాటు ధర కావాలని ఢిల్లీ సరిహద్దులలో అనేకమంది రైతులు సంవత్సరాలుగా చేస్తున్న ధర్నా మూడు చట్టాలు రద్దు చేయకుండా మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఉపాధ్యాయుని పథకానికి నిధులు పని దినాలు వేతనాలు తగ్గించి ఆ పథకాన్ని నెరవేర్యం చేసినందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పంట కాలువలకు నీటిని నిలుపుదల చేశారు. అయినప్పటికీ మరమ్మత్తు పనులు ప్రారంభించడం లేదని రైతు సంఘం మండల అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఎన్.యోగేశ్వరరావు విమర్శించారు. మళ్ళీ వర్షాలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ ప్రభుత్వం పంట కాలువలు మరమ్మతుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. అధికారంలో కూర్చున్న తర్వాత ఆరు హామీలు చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం వెంటనే ఆ హామీలు అమలు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ రైతులతో పాటు కౌలు రైతులు కూడా వర్తింపజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా పై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రత్యేక హెూదా, రైలు జోన్ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలు పొందే వరకు పోరాడాలన్నారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాలను పడిన జిల్లాలుగా ప్రకటించి ఒక్కగు జిల్లాకు 50 కోట్లు ఇస్తామన్నారు. అవి రాలేదని దీనికోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. పంటకు మద్దతు ధర కల్పించాలని అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులు కూడా అందించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులు గుర్తింపులు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని ఎన్నికల ముందు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వాగ్దానాన్ని వెంటనే నిలుపుకోవాలన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దు అని ఆందోళన చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. వాణిజ్య పంటలు అన్నిటికీ మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు మండల అధ్యక్షుడు బి.అమ్మిరెడ్డి, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వై.స్టాలిన్ పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా తిరంగా ర్యాలీలు



మాచర్లలో భారీ ప్రదర్శన



రెంటచింతలలో ప్రదర్శన

ప్రజాశక్తి - మాచర్ల

భారత మహిళల నుదిటి సింధూరాన్ని చెరిపిన ఉగ్రమూకలకు, ముష్కరులను పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత సైన్యం తగిన బుద్ధి చెప్పిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించు కొని మాచర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన తిరంగా యాత్ర చేపట్టగా రాజకీయ, రాజకీయేతర పక్షాలు, సామాన్య ప్రజలు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక రింగ్ రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ సైనికులు చేసిన వ్యూహాత్మక యుద్ధ చర్యలు మన సైనిక సత్తా ఏమిటో ప్రపంచానికి తెలియపర్చేలా ఉందని, వీరోచిత పోరాటం చేసిన మన సైనికులందరికీ ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలన్నారు. ఉగ్రవాదులను ప్రోత్సహించే ఏ దేశమైన భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. భిన్న మతాలు, భాషలతో భిన్నత్వంలో ఏకత్వంగా మన దేశముందని, దేశం మొత్తం ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. కశ్మీర్ ఇండియాలో ఒక భాగమని, ఉగ్రవాదం ఏ రూపం వున్నా పూర్తిగా అణిచివేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, రాష్ట్ర టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షులు యం.ధారు నాయక్, సీనియర్ నాయకులు కొమెరా దుర్గారావు, ఎనుముల మురళీధర్‌రెడ్డి, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, సూరె యలమంద, పోలూరి నరసింహారావు తదితర నియోజకవర్గ స్థాయి, పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రెంటచింతల

దేశం కోసం ప్రాణత్యాగం చేస్తున్న సైనికులకు వందనం వారికి బాసటగా నిలుద్దాం అంటూ కూటమి నేతలు అధికారులు వ్యాపార వర్గానికి చెందినవారు ఆది వారం రెంటచింతల పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వ హించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సంద ర్భాన్ని పురస్కరించుకొని నియోజకవర్గానికి చెందిన బిజెపి నేత పోకూరి కాశీపతి మాట్లాడుతూ పాకిస్తాన్ పై భారత్ దాడి చేయలేదని ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసి తీవ్ర వాదు లను మట్టు పెట్టిందని పేర్కొన్నారు కార్యక్రమంలో కూటమి నేతలు రాజారెడ్డి నాళం పెద్దబాబు సైదులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో ప్రదర్శన

పిడుగురాళ్లలో తిరంగా యాత్ర

ప్రజాశక్తి-పిడుగురాళ్ల: ఆపరేషన్ సింధూరం విజయ వంతమైన సందర్భంగా పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుండి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు ఎమ్మెల్సీ జంగా కష్ణమూర్తి గురజాల నియోజకవర్గ పరిశీలకులు, కళ్ళం రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసినా భారత త్రివిధ దళాలకు అభినం దనలు తెలుపుతున్నామని అన్నారు. సైనికుల పోరాట పటిమకు,సేవలకు సంఘీభావంగా స్థిరంగా యాత్ర నిర్వహి స్తున్నా మని టీటీడీ బోర్డు సభ్యులు ఎమ్మెల్సీ జంగారెడ్డి కష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఐతం నాగేశ్వరరావు,మొగిలి వెంకటేశ్వర్లు నాయక్ ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో యువ నాయకులు యరపతినేని నిఖిల్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో రోడ్డు ప్రమాదం ఒకరు దుర్మరణం

ప్రజాశ క్తి - తాడేపల్లి

ఆదివారం రాత్రి 10 గంటల సమ యంలో పెనుమాకు వైపు నుండి విజయ వాడ వస్తున్న బొలెరో వాహనం రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదం లో ఒక వ్యక్తి మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసు అధికా రు లను సంప్రదించటానికి ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గొర్రెల విషయంలో దాడి - ఒకరు మృతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎదురెదురు ఇళ్ళలో నివసిస్తున్న ఇరువురు వ్యక్తులలో ఒకరు గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో ఇంటికి గొర్రెలు వచ్చి పోయే క్రమంలో ఇబ్బందిగా ఉందంటూ పలుమార్లు జరిగిన వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్ళింది. ఈ ఘటన నరసరావు పేట మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఘటనలో గొర్రెల కాపరి కోట్ల అంజి ఫిరంగుల కోటేశ్వరరావు (40) ను కర్రతో తలపై మోదడంతో బలమైన దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం అదే గ్రామానికి చెందిన కోట్ల అంజి, మృతుడు కోటేశ్వరరావు ఎదురె



మృతి చెందిన ఫిరంగుల కోటేశ్వరరావు

దురు ఇళ్లలో నివసించే వీరిద్దరి మధ్య గొర్రెల విషయంలో కొంత కాలంగా వివాదం ఉంది. గొర్రెలను తమ ఇంటి ముందు ఉంచవద్దని కోటేశ్వరరావు పలుమార్లు అంజిని హెచ్చరించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం ఇరువురు మధ్య ఇదే విష యమై వివాదం తలెత్తడంతో గ్రామ పెద్దల వద్ద మాట్లాడుకుందామని వెళు తుండగా మాట మాట పెరిగి మతుడు కోటేశ్వరరావు అంజిని నెట్టడంతో ఆగ్ర హంతో కర్రతో కొట్టడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే కుప్ప కూలి పోయాడు. స్పందించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట ఒక ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మతి చెందినట్లు ధ్రువీకరించారు.కాగా నిందుతుడు పరారీలో ఉన్నాడు. మతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్.ఐ కిషోర్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ వెంకటరావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం నందు రహస్యంగా 15 మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం తో దాడి చేసి నిందితులను అదుపులో తీసు కున్నామని తెలిపారు వారి వద్ద నుంచి రూ. లక్షా 50వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిపై దాడిని ఖండించిన సిఐటియు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడోవ సంవత్సరము చదు వుతున్న విద్యార్థి జేమ్స్ పట్ల తన కంటే జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు తన రౌడీ అనుచర గణం అనుచితంగా ప్రవర్తించిన తీరు దారుణం అని సీఐటియు మండల కన్వీనర్ పెరుబోయిన వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యశ్వంత్ నాయుడు రౌడీషీ టర్, రూపేష్ మరో రౌడీషీటర్ చోట బ్లేడ్, కిరణ్ జగ్గ, నాని మొదలగు వారు బూతులు తిడుతూ రాడ్లు కత్తితో హాకీ కర్రలతో కొడుతూ కాళ్లతో తన్నుతూ మూత్రం తాగించిన ఘటన సిగ్గు చేటని పేర్కొన్నారు. తక్షణమే దోషులైన వారిని బహిరంగ కఠిన శిక్షలు పడేలా చూడాలని, ఆ కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని ఎస్సీ ఎస్సీ, బీసీ మైనారిటీ తల్లిదండ్రులకు ఈ ఘటన దృష్టిలో ఉంచుకొని ఏ కళాశాల యాజమాన్యం అయితే తమ కళాశాలలో కులం, మతం, వర్గం రాజకీయాలతో సంబంధం లేకుండా లౌకిక ప్రజా స్వామ్య వాతా వరణంలో పనిచేస్తుందని విద్యార్థు లకు భద్రత భరోసా ఇవ్వగలమని బహిరంగ బోర్డు పెట్టి గ్యారెంటీ పత్రము ఇవ్వగలిగిన చోట చేర్పించాలన్నారు. విద్యాలయాల్లో ఇలాంటి సంఘటనలు జరగటం దురదష్టమని పేర్కొన్నారు.

నేడు శిరిగిరిపాడులో జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వెల్దుర్తి మండలం, శిరిగిరిపాడులో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి తిరుణాల మహోత్సవం సందర్భంగా గ్రామ పెద్దలు ఆధ్వర్యం లో ఏర్పాటు చేస్తున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో క్రీడాకారులు, క్రీడా అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం ప్రారంభమఖీతున్న ఈ టోర్నమెంట్‌ను ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మంత్రులు సత్య కుమార్, రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు, శాప్ చైర్మన్ రవి నాయుడు తో పాటు పలువురు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు యం. ధారు నాయక్, టిడిపి సీనియర్ నాయకులు యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో మినీ మహానాడు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

టిడిపికి పండుగ మహానాడు అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ నందు మినీ మహానాడు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు. టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ తెలుగు వారి ఖ్యాతిని ఆత్మ గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు కర్షకులకు రైతులకు అండగా నిలబడ్డ పార్టీ టిడిపి అని అన్నారు. మహానాడు కార్యక్రమం కార్యకర్తల్లో నాయకుల్లో నూతన ఉత్సాహం తీసుకొస్తుందని చెప్పారు. యువ నాయకులు యరపతినేని నిఖిల్ మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ కన్వీనర్లు, వివిధ స్థాయిల్లోని నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాయలసీమ, పల్నాడు ప్రాంతానికి పరిమితం అయిన ఫ్యాక్షన్ రాజకీయాలు కూటమి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపిం చాయని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. విలేఖరుల సమావేశంలో మహేష్ రెడ్డి మాట్లా డుతూ రెడ్ బుక్ పాలనతో కూటమి ప్రభుత్వం ప్రజాణజురణ కోల్పోయిందన్నారు. సంక్షేమ పథకాలు ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడు తున్నార న్నారు. నిరు ద్యోగులకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి అమలు చేయలేదన్నారు. గురజాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు, కక్ష పూరిత రాజకీయాలకు స్వస్థి పలికి అభివద్ధి, ఎన్నికల హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమశ్రీ

ఉచిత గ్యాస్ డబ్బులు జమవ్వక ఇబ్బందులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి:

కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ డబ్బులు బ్యాంక్ అకౌంట్ లో పడక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఉచిత గ్యాస్ డబ్బులు వారి వారి బ్యాంక్ అకౌంట్లో వేయాలని అఖిల భారత ప్రజాతంత్రం మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి జి,ఉమశ్రీ ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పుతుంబాక భవన్లో జరిగిన సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి షేక్ రంజాన్ బి అధ్యక్షత వహించారు. ఉమాశ్రీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారిస్తూ మహిళల జీవితాలను ఛిద్రం చేస్తున్నదని అన్నారు. రేషన్ షాపులో ద్వారా బియ్యం, పంచదార తప్ప మిగతా నిత్యవసర వస్తువులు ఇవ్వడం లేదని అన్నారు. కందిపప్పు కూడా ఇవ్వటం లేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఐద్వా చేపట్టే ఉద్యమాలలో మహిళలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని, ఐద్వా నాయకులు ఎస్ దుర్గాబాయి, సుజాత, డి విమల, టి లక్ష్మి, కె సుధారాణి పాల్గొన్నారు.



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న

పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ఆటో ప్రచారం

ప్రజాశక్తి - అచ్చంపేట

రైతుల పండించే పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అచ్చంపేట క్రోసూరు మండలాల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్చంపేటలో ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత పెట్టుబడి సాయం రూ. 20 వేలు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు పెంచాలని 200 రోజుల పని దినాలను కల్పించాలని వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు నిషేధించాలని నూతన కౌలు చట్టం అమలు చేయాలని మాట్లాడారు. మండలం లోని అన్ని గ్రామాలలో కరపత్రాలు పంచుతూ మే 20వ తేదీన ఆంధ్రాలో జరిగే నిసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలంటూ ఆయన పిలుపు నిచ్చారు ప్రచారయాత్రలో భాగంగా తిమ్మిశెట్టి జగన్నాథం ఏపూరి వెంకటేశ్వర రావు చిన్నప్ప పాల్గొన్నారు



ఎంపికైన విద్యార్థులతో కోచ్, స్కూల్ ప్రతినిధులు

అండర్ -11 రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పల్నాడు జిల్లా చెస్ డెవలప్మెంట్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అండర్-11 చెస్ జట్ల ఎంపిక పోటీలను ఆదివారం మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో మొదటి రెండు స్థానాలలో కె. జె మాగ్నస్, ఎ.అభి నయ్, బాలికల విభాగంలో బి. మేఘ శ్రీ కోమలి, ఓ.పుష్పిత నిలిచారు. ఈ నలుగురు ఈనెల 24,25 తేదీలలో నరసరావు పేటలో జరిగే అండర్- 11 రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కిరణ్ తెలిపారు. ముఖ్య అతిథి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటుఆటలు, పాటలు, క్రీడలులో పాల్గొనడం ద్వారా అనుకున్న గోల్ సాధించగలరన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్స్ రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, హరీష్చంద్ర, ప్రిన్సిపాల్ హనుమంతరావు, యూనివర్సల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎ. వీరాంజనేయులు, పాఠశాల సిబ్బంది, క్రీడాకారులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట మండలంలో వర్ష బీభత్సం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శనివారం రాత్రి ఉరుము, మెరుపులతో కురిసిన భారీ వర్షం దాటికి మండల పరిధిలో ఉన్న మురికిపూడి గ్రామంలో మూడు అంత స్తుల భవనం మీద పిడుగు పడడంతో స్వల్పంగా దెబ్బతిన్నది. పిడుగు పడ్డ ఆ నివాసంలో నివాసం ఉంటున్న ఎవరికి ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. అయితే ఆ ఇంట్లో టీవీ ఫ్రిడ్జ్ ఫ్యాన్లు అన్ని కాలిపోయాయని యజమాని ఆంజనే యులు తెలిపారు.



దెబ్బతిన్న భవనం

ఉప్పు, పప్పు, కారం అన్నీ కల్తీనే!

ప్రజారోగ్యంతో వ్యాపారుల చెలగాటం ... తూనికలు, కొలతల్లోనూ మోసాలు

అంతంత మాత్రంగానే అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - మాచర్ల

ఇటీవల ఒక వినియోగదారుడు తన ఇంట్లో ఫంక్షన్ నిమిత్తం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న హోల్సేల్ వ్యాపారి వద్ద సరుకులు కొనుగోలు చేశాడు. వంట చేసే సమయానికి పొట్లాలు ఊడతీసి చూడగా పుచ్చిపోయిన జీడిపప్పు, తుట్టెలు కట్టిన కందిపప్పు, నాసిరకం సరుకులు చూసి లబోదిబో అనాల్సి వచ్చింది. ఆతరువాత వ్యాపారిని నిలదీస్తే నేరం గుమాస్తాలపై నెట్టి తప్పించుకున్నాడు.

ఒకతను బజార్లో మూడు కిలోల మామిడి కాయలు తెచ్చి, ఇంటి వద్ద నున్న దుకాణంలో కాటా వేయగా అరకిలో తగ్గింది. తిరిగి ఆ వ్యాపారి వద్దకు వెళ్లి అడగగా ఆ వ్యాపారి గొడవకు దిగాడు.

కాదేది కల్తీకి అనర్హమంటూ మాచర్లలో వ్యాపారులు రెచ్చిపోతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఉప్పు, పప్పు, బియ్యం, పుసుపు, కారం, నూనె, నెయ్యి, అల్లం, బెల్లం, పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్, ఆఖరికి పిల్లలు తాగే పాలు తినుబండారాలు కూడా కల్తీ జరుగుతోంది. ఉప్పులో శుద్ధపొడి.. పసుపులో తౌడు, సింథటిక్ రంగులు.. కారంలో కందిపొట్టు, ఇటుక పొడి, రంగులు.. తేనెలో బెల్లం పాకం.. కాఫీ పొడిలో చింతపండు గింజల పొడి.. బెల్లంలో వాషింగ్ సోడా, సుద్ద పొడి.. బియ్యంలో రేషన్ బియ్యం, నిల్వ చేయటానికి రసాయనాలు వాడుతున్నారు. నెయ్యి, జున్నులో మెత్తని బంగాళదుంపలు, వనస్పతి, స్టార్చ్ పౌడర్ కలుపుతున్నారు. ధాన్యాల్లో రాళ్లు, గడ్డి, కలుపు విత్తనాలు, దెబ్బతిన్న ధాన్యంను కల్తీ చేస్తున్నారు. పాలల్లో డిటర్జెంట్ పొడి యూరియా గంజి.. నూనెలో జంతు వ్యర్థాల నూనె, కాటన్ సీడ్ ఆయిల్ కలుపుతున్నారు. రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్లలో తయారయ్యే ఆహార పదార్థాల్లో టేస్టింగ్ సాల్టు, రంగులు, కుళ్లిన మాసం వాడుతున్నారు. రోడ్ల పక్కన బండ్లపై తయారు చేసే బోండాలు, టిఫిన్, చికెన్ పకోడి, మరిగిన నూనెను తిరిగితిరిగి వాడుతున్నారు. పండ్లు పాకానికి రావటానికి రసాయనాలు,పైకి మెరవటానికి మైనం పూత రాస్తూ ఇలా ప్రతి ఆహార పదార్థాలు కల్తీ చేస్తున్నారు.

మద్యాన్నీ కూడా కల్తీ చేస్తున్నారు. బాటిల్ సీల్ తీయకుండా, లోపల మందుని మార్చేస్తూ ఖరీదైన స్కాచ్ బాటిళ్లలో చీప్లిక్కర్ కలుపుతున్నారు. జిలేబి, పానీపూరీ చేసే ప్రాంతాలు అపరిశుభ్రంగా, పరమ భయంకరంగా వుంటాయి. ఫ్రూట్ సలాడ్, ఐస్ క్రీమ్, ఐస్, నూడిల్స్ తయారు చేసే ప్రదేశాల్లో శుచి, శుభ్రత పాటించక అవి తిన్న వారు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. కొంతమంది దుకాణదారులు ప్రతీది రెండోరకం వస్తువులను విక్రయిస్తున్నారు. కంది, శనగపప్పు, పెసరపప్పు, పంచదార, మినపప్పు తదితర నాసిరకం ఉన్న వాటిని విక్రయిస్తున్నారు. దీనికి తోడు గడువు తీరిన ఆహార పదార్థాలను యథేచ్ఛగా అమ్ముకొంటూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. తప్పుడు తూకం, కొలతలతో వ్యాపారులు ప్రజలను మోసం చేస్తున్నారు.

నాలుగు నెలల క్రితం మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని పలు ప్రముఖ రెస్టారెంట్లను తనిఖీ చేయగా విపరీతమైన రంగులు వేసి తయారు చేసిన వంటకాలు, కుళ్లిన ఆహార పదార్థాలు, మాసం బయటపడ్డాయి. నాలుగు రోజుల క్రితం ఒక హోటల్లో టిఫిన్ చేసిన కొందరు అస్వస్థతకు గురయ్యారు.

కల్తీ ఆహారం వల్ల పేగు లోపాలు, ఇతర కడుపు రుగ్మతలు, కాలేయ రుగ్మతలు, శరీరంలో విషప్రభావం, అతిసార, మూత్రపిండాల వైఫల్యం, తీవ్రమైన అలర్జీ ప్రతిచర్యలు, ఉదర సంకోచాలు, మల విసర్జన సమస్యలు, అధిక కొలెస్ట్రాల్, పక్షవాతం, గుండె ఆగిపోవడం, రక్తంలో చక్కెర తగ్గడం, నోటి పుండ్లు, గ్యాస్ట్రిటిస్ సమస్యలు, ముఖ్యమైన అవయవాల వాపు. ఊపిరితిత్తులు అవయవాలను ప్రభావితం చేసే భయంకరమైన వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం వుంటుందనీ హెచ్చరిస్తున్నారు.



పట్టణంలోని పచారీ కొట్టులో సరుకులు

కల్తీ ఆహార పదార్థాల నివారణకు తూనికల కొలతలు, పౌర సరఫరాలు, కల్తీ నిరోధక శాఖ, విజిలెన్స్, వాణిజ్య పనుల శాఖ ఇలా ఎంతో మంది అధికారులున్నా పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కొక్క అధికారి పరిధిలో 15 నుండి 20 మండలాలు వుండటం. ఒక్కసారి ఒక గ్రామానికి తనిఖీకొస్తే మరోమారు అదే గ్రామానికి రావటానికి నెలల సమయం పడుతుంది. నమోదు చేసిన కేసులు కోర్టుల్లో ఎక్కువ సమయం గడవడం వల్ల దీనిని ఆసరాగా తీసుకొని వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య తనిఖీ అధికారులు, సిబ్బందిని పెంచాలని, కల్తీలు, తూకంలో మోసాలు చేసిన వారికి కఠిన శిక్షలు వేయాలని, ఆయా శాఖల అధికారులు మాచర్ల ప్రాంతపై దృష్టి సారించి తరుచూ తనిఖీలు చేయాలని, స్థానికులు కోరుతున్నారు.

ఏడాదిలో 8 కేసులు నమోదు చేశాం..

లక్ష్మీనారాయణ, ఫుడ్ఇన్స్పెక్టర్, నరసరావుపేట

అవకాశం వున్నంత మేరకు తనిఖీలు నిర్వహిస్తూ, కేసులు నమెదు చేస్తున్నట్లు ఆహారశాఖ అధికారులు చెబుతున్నారు. ఏడాది కాలంలో మాచర్ల ప్రాంతంలో 8 కేసులు నమోదు చేశామని, గడువు ముగిసిన సరుకులను అమ్ముతున్న ఓ వ్యాపారిపై కేసు నమోదు చేయగా అతనికి రూ.లక్ష జరిమానా పడినట్లు చెప్పారు. తాము కేసులు నమోదు చేయటమే కాకుండా ఆ పనులపై కోర్టులు చుట్టూ తిరగాల్సి ఉంటుందని చెప్పారు. ఎవరైన తమ దృష్టికి వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

'పది'లో ప్రతిభ చూపిన జొన్నలగడ్డ యశ్వంత్కు ఘన సన్మానం



యశ్వంత్ని సన్మానిస్తున్న ఎంఈఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల లో అత్యధిక మార్కులు486/500 సాధించిన జొన్నలగడ్డ యశ్వంత్ ని ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘన సన్మానం జరిగింది. మండలంలోని గార్ల పాడు గ్రామములో జరిగిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి పాలెపోగు సుమని, ఎంఈఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గరికపాటి హిట్లర్, జాయింట్ సెక్రటరీ విజయ్ వర్ధన్, ఉపాధ్యాయులు రామకోటయ్య, సురేష్ ఎస్ బిఐ మేనేజర్ మణిదాస్, హెడ్ క్యాషియర్ జాన్సన్,ప్రేమ్ కుమార్, చిలుక రమణయ్య మరియు గార్లపాడు గ్రామస్తులు యస్వంత్ కు అభినందనలు తెలిపారు.

భూములను బలవంతంగా తీసుకోం

గ్రామ సభల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రజాశక్తి - పెదకూరపాడు

ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు ఎవరి వద్ద బలవంతంగా తీసుకోబోమని పెదకూరపాడు శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండలంలోని బలుసుపాడు, ఖమ్మంపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంతకం పెడితేనే చెల్లుతుంది అన్నారు. రాజధాని 29 గ్రామాలలో రైతులకు ఇచ్చినట్లుగానే ఇక్కడ కూడా ప్లాట్లు కేటాయించడం,వ్యవసాయ కూలీలకు అదేవిధంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. రెండు గ్రామాలకు కలిపి ఒకే చోట ప్లాట్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాల్లో అభివద్ధికి శ్రీకారం చుడతామన్నారు. అప్పటివరకు భూములకు కౌలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఎటువంటి అపోహలకు తావు లేదన్నారు. ఏకైక రాజధానిగా అమరావతి ఉండే విధంగా చట్టబద్ధత కల్పిస్తామన్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఉపాధి కల్పించాలని లేదా ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు కోరారు. బలుసుపాడు గ్రామంలో అప్పటికప్పుడే కొంతమంది రైతులు భూమిని ఇస్తామని తెలిపారు. ఖమ్మంపాడు గ్రామంలో రైతులు భూములు ఇస్తామని ఎక్కువమంది ప్రకటించారు. అయితే తమకు ప్లాట్లను ప్రధానమైన ప్రాంతంలో ఇవ్వాలని కొంతమంది కోరారు. సత్తెనపల్లి ఆర్డిఓ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు భూములు ఇచ్చేది ప్రభుత్వానికనే గుర్తుపెట్టుకోవాలి అన్నారు. ఆయా సభల్లో తహశీల్దార్ ధనలక్ష్మి, మండల టిడిపి అధ్యక్షులు రమేషు, మండల రెవెన్యూ సిబ్బంది, మండల సర్వేర్లు, టిడిపి నాయకులు గంటా పాపయ్య, మాదినేని సుబ్బయ్య, వెంకట్రావు, శ్రీనివాసరావు, ఆ గ్రామాల ప్రజా ప్రతి నిధులు, సచివా లయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

అధిక మార్కులకు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - అమరావతి

మహేంద్ర సంగీలు విద్యార్థి విద్యార్థులు టెన్త్ క్లాస్ 500 మార్కులు పైన వచ్చిన వారికి అమరావతి చెందిన మహేంద్ర పల్నాడు జిల్లా అధ్యక్షులు జ్వరగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమరావతిలో అభినందన సభలో భవిష్యత్ కాలంలో విద్యా ర్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని ప్రోత్సాహంగా వెయ్యి రూపాయలు బ్యాగు బుక్స్ పెన్ను విద్యార్థుల్ని అభినం దిస్తూ ఉన్నతమైన చదువులు చదవాలని ప్రోత్సహించారు అమరావతి కల్లం బ్రహ్మయ్య స్మార్గ భవనంలో కార్యక్రమం జరి గింది రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రిటైర్మెంట్ ఎమ్మార్వో మస్తాన్ రావు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

జలకాలాటలలో... ఏమి హాయిలే హలా!

ప్రజాశక్తి - మాచర్ల

పక్కన ఉన్న ఫొటోలో ఎండ వేడిమిలో గేదెలు నీటిలో గడపటం చూస్తుంటే ఓ సినిమా లోని జలకాలాటలలో... ఏమి హాయిలే హలా.. అనే పాట తప్పక గుర్తుకు వస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మేతకు వెళ్ళిన పశువులు ఎండ వేడిక్కే సమయానికి సమీపంలో ఉండే చెరువుకో, వాగులోకో చేరతాయి. అప్పటి దాకా తిన్నది నెమరేసుకుంటూ ఎండ వేడి తగ్గే వరకు నీళ్లలో ఉండి, ఆ తర్వాత దారి వెంట మేత మేసుకుంటూ ఇంటిదారి పడతాయి. పైన సూర్యుడు తన ప్రతాపం చూపు తూంటే, నీవు నన్ను ఏం చేయలేవంటూ పశువులు నీళ్లలో ఈదులాడుతూ అవి ఆస్వాదిస్తున్న హాయిని చూసిన ప్రతి ఒక్కొరికి ఆహా! ఏమి వాటి భాగ్యం అనుకోక తప్పదు కదూ!



మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలి

- రేపు మండల కేంద్రాల్లో ఆందోళనలు
- పలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న రైతుసంఘం



కాకుమాను మండలంలో పొగాకు రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - పెదనందిపాడు, తాడేపల్లి రూరల్

పంటలకు మద్దతు ధరలను గ్యారెంటీ చేస్తూ చట్టం చేయాలని, పొగాకును రూ.15 వేలకు తక్కువ కాకుండా సత్వరమే కొనాలని రైతుసంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.శివశంకరరావు, కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై మంగళవారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో రైతులు, కౌలురైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతుసంఘం నాయకుల బృందాలు కాకుమాను, పెదనందిపాడు, తాడేపల్లి మండలాల్లో పర్యటించాయి. కాకుమాను మండలం కొమ్మూరు, పెద్దివారిపాలెం, కొండపాటూరు, కాకుమాను గ్రామాల్లోని రైతులతో అజయ్‌కుమార్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పెదనందిపాడు మండలంలో పర్యటన అనంతరం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాకుమాను మండలంలో సాగుదార్లు మాట్లాడుతూ ఈ పరిస్థితి వస్తుందని తాము ఊహించలేదని, తల తాకట్టు పెట్టి పొగాకు పండించి పూర్తిగా మునిగి పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు ఆకు తడిచి ఇప్పటికే పాడైపోయినదని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ పొగాకును కొనాల్సిన కంపెనీల నిర్లక్ష్యం వల్ల సాగుదార్లు పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయారని చెప్పారు. సన్న, చిన్నకారు రైతులు, కౌల్దార్లు ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారని, ఇప్పుడు కంపెనీలు మొహం చాటేయడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరమైందని అన్నారు. గతేడాది రూ.15-20 వేలకు కొన్న కొంపెనీలు ఇప్పుడు రూ.3-4 వేలకే కొంటామని చెబుతున్నాయని, అదీ చేయకపోవడంతో వర్షాలకు ఆకు తడుస్తోందని చెప్పారు. మూణ్ణెలలైనా రైతు అమ్ముకోలేని దుస్థితి ఎందుకు తెచ్చారని నిలదీశారు. దీనికి బాధ్యులైన కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా, ఇతరసదుపాయాలు ఆపేయడంతోపాటు వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు పెట్టి రూ.15 వేలకు కొనాలన్నారు. లేకుంటే చలో సిఎం క్యాంప్ ఆఫీస్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకట సుబ్బారావు, ఎన్.రాజేంద్ర, జె.రామారావు, ఎం.రమేష్, చంద్రకాంత్, జి.సురేష్ పాల్గొన్నారు.

తాడేపల్లి మండలం ఇప్పటంలో శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేసే విధానాలను అవసంబిస్తోందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామని ఎన్నిలప్పుడు వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు.రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో పొలాలకు నీరందించే ఆంధ్రరత్న పంపింగ్ స్కీం పంట కాల్వ మురుగునీటితో కలుషితమైందని, దాన్ని బాగు చేయించాలని కోరారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుసంఘం నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ భూ యజమా నితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, పంట రుణాలు, ఇతర వ్యవసాయ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

ఇప్పటంలో రైతులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు



స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర పేరిట అంతా హడావుడే

- అధికారులు, ప్రజాప్రతినిధుల సాక్షిగా ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ బిల్డింగ్ వెనుక ఫుట్ బ్రిడ్జి సమీపంలో చెత్తా చెదారం

ప్రజాశక్తి - తెనాలి

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర పేరిట చేపడుతున్న స్వచ్ఛతా కార్యక్రమాలలో స్వచ్ఛత కరువైంది. వారం రోజులు ముందుగా ప్రకటించి 'బీట్ ది హీట్' పేరిట హడావుడి చేసిన అధికారులు అక్కడితోనే ఆగిపోయారు. అధికారులు ప్రజాప్రతినిధుల సాక్షిగా శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, ఎక్కడి చెత్త అక్కడే వదిలేసారు. దీంతో ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర పేరిట ప్రతినెల మూడవ శనివారం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడతారు. అదే ప్రకారం ఈనెల 17న 'బీట్ ది హీట్' పేరిట స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ తో పాటు సబ్ కలెక్టర్, చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్ వివిధ శాఖల అధికారులు పాల్గన్నారు. శివాజీ చౌక్ నుంచి మార్కెట్ కూడలి వరకు, అక్కడినుంచి చెంచుపేట జిల్లా వైద్యశాల వరకు రోజంతా కార్యక్రమాలు నిర్వహించారు. కాలువలు పూడికతీశారు. పెద్ద ఎత్తున వ్యర్థాలను తొలగించారు. తొలగించిన వ్యర్థాలను ఎక్కడికక్కడ మేటవేశారు. కార్యక్రమం పూర్తయిన వెంటనే ఎవరి దారిన వారు చిత్తగించారు. ఇక తొలగించిన వ్యర్థాలు అలానే ఉండిపోయాయి. కార్యక్రమం నిర్వహణ శనివారం కావడం, మరుసటి రోజైన ఆదివారం ఉదయం ఆ వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు పూనుకున్నా, తూతూ మంత్రంగా ముగించారు. దీంతో పట్టణంలో చెత్త చెదారం ఎక్కడికక్కడే నిలిచిపోయింది. కార్యాలయానికి కూత వేటు దూరంలోనే కూరగాయల మార్కెట్లో, మున్సిపల్ బిల్డింగ్ వెనుక, తూర్పు కాలువలో వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా దర్శనమిచ్చాయి. ఇక ఆ చెత్త తొలగింపుకు మోక్షం తిరిగి సోమవారమే. మూకుమ్మడిగా స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించినా అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం విమర్శలకు తావిచ్చింది. శు భ్రతపై ఎంత ఆర్భాటంగా ప్రచారం నిర్వహించినా దానికి తగిన రీతిలో శుభ్రతపై చిత్తశుద్ధి కనపరచక పోవడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. అధికారులు ఇలాంటి పరిణామాలు పునరావఅతం కాకుండా చర్యలు తీసుకోవాలి ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ మార్కెట్లో మేట వేసిన వ్యర్థాలు

వీర సైనికునికి ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సైనికులు సాధించిన విజయాన్ని పురస్కరించుకుని తెనాలి కాటూరి శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, జై జవాన్‌కి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రిణి నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిలుగా పాల్గని భారతమాత, చత్రపతి శివాజి మహారాజ్ విగ్రహాలను ఆవిష్కరించారు. భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయం సాధించటం భారతదేశం గర్వించదగ్గ అంశమన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాకిస్తాన్ ఉగ్రమూకల ఆటకట్టించిన భారతదేశ త్రివిధ దళాల సైనికులకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. దుర్భేద్యమైన పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై యుద్ధ విమాణాలతో విరుచుకుపడిన సైనికులకు భారతదేశ ప్రజలు మరింత ధైర్యాన్ని నింపాలన్నారు. కాటూరి చేతుల్లో రూపొందిన ఆంధ్రప్రదేశ్ వీర జవాను మురళి నాయక్ విగ్రహంపై పూలవర్షం కురిపించారు. ఆటోమోటివ్ ఇనుప పరికరాలతో రూపొందించి తమ చేతులమీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలను మంత్రి మనోహర్ అభినందించారు. సమయస్ఫూర్తి, కళా నైపుణ్యంతో జీవ కళ ఉట్టిపడేలా కాటూరి శిల్పాలు ఉన్నాయన్నారు. ఇటీవల 26 మంది పర్యాటకులను వుగ్రవాదులు హతమార్చడం దుశ్చర్య అన్నారు. సైనికులకు ధైర్యం నింపి త్రివిధ దళాలను యుద్ధానికి సమాయత్తపరచిన ప్రధాని మోది తెగువను అభినందించా లన్నారు. నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ కాటూరి కళను చూసి మంత్రి మనోహర్ ముగ్ధులవ్వడం ఆనందంగా ఉందన్నారు. త్యాగాలు చేసి దేశాన్ని రక్షిస్తున్న వీర సైనికులకు ధైర్యాన్ని నింపడమే మనమిచ్చే గౌరవమన్నారు. దేశభక్తి పెంపొందించే విధంగా యువతకు ప్రేరణ కలగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కాటూరి శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరావు అన్నారు. ప్రతిమలను అందంగా తీర్చిదిద్దుతున్న కాటూరి రవి చంద్ర, కాటూరి శ్రీ హర్ష సిబ్బందిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో సహజకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, శాంతి కుమార్, సాంబశివరావు, ఉమామహేశ్వరరావు, టైలర్ కొండారెడ్డి, ఆలూరు వెంకటేశ్వర్లు, జనసైనికులు పాల్గొన్నారు.



శివాజి మహరాజ్, భరతమాత విగ్రహాలను అవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, నన్నపనేని రాజకుమారి





నాగమల్లేశ్వరి మృదేహంపై పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, నాగమల్లేశ్వరి (ఫైల్)

సిపిఎం అభిమాని నాగమల్లేశ్వరి మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ కమిటీ సభ్యులు కూరపాటి శ్రీనివాసరావు సతీమణి, సిపిఎం అభిమాని నాగమల్లేశ్వరి(58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సిపిఎం నాయకులు నాగమల్లేశ్వరి భౌతికయానికి మాలలువేసి నివాళులర్పించారు. కూరపాటి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాగమల్లేశ్వరి మృతదేహంపై పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సిపిఎం పట్టణ నాయకులు బాలాజీ, సిపిఎం శాఖ సభ్యులు హేమ సుందరరావు, నరసింహా రావు, గోలి దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులను, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దాతలు

'పది'విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - తెనాలిరూరల్

పది పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల విద్యార్థులకు కలష్ణవేణి వాటర్ ప్లాంట్ అధినేత మల్లిబోయిన నాగరాజు ఆదివారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల పూర్వ విద్యార్థి కలష్ణవేణి జ్ఞాపకార్థం ప్రదమస్తానం సాధించిన విద్యార్థులు షేక్ ఫరీద్, బి.లక్ష్మి మాధురిలకు రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయిని ఎన్.ప్రసూనాదేవి మాట్లాడుతూ నగదు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమన్నారు. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో విద్యా కమిటి చైర్మన్ గాలి కిరణ్, చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, సిహెచ్ సింహాద్రి, పి.విజయ్ కుమార్, ఝాన్సీ, వాణి తదితరులు పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న సీహెచ్ఓలు

21వ రోజుకు సిహెచ్ఓల సమ్మె

ప్రజాశక్తి - గుంటూరు

వైద్య, ఆరోగ్యశాఖ ఆరేళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారంతో 21వ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక, జిల్లా సెక్రెటరీ పల్లపాటి లింగరాజు మాట్లాడుతూ న్యాయమైన తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ, జిల్లా నాయకులు మేరీ పుష్ప, దివ్య, స్వాతి, మౌనిక జహీర్, సాయి, జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న దారునాయక్

అట్రాసిటీ చట్టం పై అవగాహన అవసరం

టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దారునాయక్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారు నాయక్ అన్నారు. మాచర్ల మండలం విజయపురి సౌత్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఆదివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ముఖ్య అతిథిగా దారునాయక్ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ షి చేయాలన్నారు. ఎస్సి, ఎస్టీలు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకా లను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాల న్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాణావత్ వెంకటేష్ నాయక్, మహబూబ్ నగర్ ఎస్సి ఎస్టీ కోర్టు పీపీ రాజేశ్వరావు, హైకోర్టు అడ్వకేట్ కృష్ణారెడ్డి, ఏఎస్ఐ రామకష్ణ రెడ్డి,ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబ్, మాచర్ల నియోజకవర్గ టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్, మండల టీడీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు గుండలా నాయక్,లాయర్ చందన్‌సింగ్ నాయక్,స్వామి నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - రెంటచింతల

సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టతనిస్తూ మహిళలు ఎప్పుడెప్పుడు అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైందని శిల్పారామం చైర్మన్ చేరెడ్డి మంజులా రెడ్డి అన్నారు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణము పాఠశాలలు తెరిచేసరికి తల్లికి వందనం పథకం కింద మహిళల ఖాతాలో డబ్బులు జమ చేయడానికి సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని తెలిపారు గత ప్రభుత్వ పాలకులకు భిన్నంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకునే వారు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేయడం విశేషం అన్నారు రాబోయే రోజుల్లో మూడు సిలిండర్లు ఒకేసారి నగదు జమ చేయబోతున్నారని అన్నారు. అన్నదాతల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయి అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ రుణాల పరిమితి పెంచాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేయబోయే ఎస్.సి కార్పొరేషన్ రుణాల పరిమితిని పెంచాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామిని రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్.సి కార్పొరేషన్ రుణాలు గత ప్రభుత్వంలో అందజేయకపోవడంతో రుణాల కోసం ఎక్కువ మంది ఆశావాహులు ఎదురు చూస్తున్నారని వీలైనంత ఎక్కువ రుణాలు లబ్ధిదారులకు అందజేసేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ నెల 10వ వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసు కునే సమయం ఉన్నప్పటికీ రెండు రోజుల ముందు నుండే ఆన్లైన్ పని చేయకపోవడంతో దరఖాస్తు చేసుకునే వారు నిరాశ కుగురయ్యారన్నారు. తిరిగి వారు దరఖాస్తు చేసుకునే అవకా శం కల్పించాలన్నారు.

పరిశుభ్రతంటూ ఒకవైపు ప్రచారం.. మరోవైపు దుర్గంధం

ప్రజాశక్తి- నరసరావుపేట టౌన్



దుర్గంధం వెదజల్లుతున్న నరసరావుపేట పుర వీధులు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో శుభ్రత అనే మాట కనబడటం లేదు రోడ్ల మీద చెత్త మురికి మట్టి కుప్పలు పేరుకుపోయి రోజులు రోజులు ఉంటున్నాయి. ఒకవైపు నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణ ప్రజలతో, అధికారులతో కలిసి స్వచ్ఛ నరసరావుపేట అంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఎక్కడంటే అక్కడ దుర్గంధం రాజ్యమేలుతోవంది. స్థానిక పెద్ద చెరువు లోని కస్తూర్బా బాలికల పాఠశాల రోడ్డులోని కాలవలో వర్షానికి కొట్టుకు వచ్చి అడ్డుపడ్డ చెత్త, కంప, మురికిని తీసి రోడ్డుమీద వేసి వారం రోజులు అవుతున్నా చెత్తను తొలగించలేదని, ఆ మురికి నుంచి వచ్చే దుర్గంధంతో, దోమలతో ఇబ్బందులు పడుతున్నా మని, రోడ్డుమీద వెళ్లే వాహనాలకి కంప అడ్డు గా ఉండి రోడ్డు సగం మూసుకుపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బాలయ్య నగర్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న పుర పాలక డస్ట్ బిన్ నిండి చెత్త రోడ్డు మీదకు వచ్చి పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటితో పాటు వీధి కుక్కలు ప్రజలను గాయపరుస్తూ భయభ్రాంతులు చేస్తున్నాయి. ఒకవైపు కుక్కలు, మరోవైపు చెత్తా చెదారంతో నరసరావుపేట పట్టణ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వరికపూడిసెలను పూర్తి చేస్తేనే రాజకీయాలు

లేకుంటే జీవితంలో రాజకీయాలు మాట్లాడను - దద్దమ్మ రాజకీయాలు మానుకో పిన్నెల్లి

రెచ్చగొడితే నేనేంటో చూపిస్తా.. : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల కల వరికపూడిశెలను పూర్తి చేయకుంటే తన జీవితంలో రాజకీయాలు మాట్లాడను అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. ఆదివారం పట్టణంలోని స్థానిక నెహ్రూ నగర్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పల్లెల్లో వైసీపీ మూకలు రాజకీయ చిచ్చు రేపుతూ, శునకానందం పొందుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. వరికపూడి శెల పూర్తి చేస్తానని చెప్పి.., ఎన్నికల ఐటెం గా 15 సంవత్సరాలు రాజకీయ పబ్బం గడిపి, పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు రామకష్ణారెడ్డి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం అని చెప్పిన పిన్నెల్లి మాటమార్చి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం హయాంలో వరికపూడిశెల ఫేజ్ - 1, ఫేస్ - 2 లను పూర్తి చేసి, పల్నాడు ప్రజలకు సాగు,తాగు నీరు అందించి, దాహార్తిని తీరుస్తామని భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నా సహనాన్ని పరీక్షిస్తే ఊరుకోను

నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పేందుకు సహనం పాటిస్తున్నానని.., అలాగని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే నేనేంటో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. నియోజకవర్గంలో దౌర్జన్యాలు, దాడులు, హత్యలు, అవినీతి, దుర్మార్గ రాజకీయాలు చేసే వ్యక్తికి వైసీపీలో పల్నాడు జిల్లా అధ్యక్ష పదవా..? అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో కులాలు, మతాలు, వర్గాల మధ్య రాజకీయ చిచ్చు రాజేసి..,రాజకీయ పబ్బం గడపాలని చూస్తే సహించేది లేదని ఈ సందర్భంగా జూలకంటి హెచ్చరించారు.

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ పోలీసుల లక్ష్యం

ఎస్.పి కె.శ్రీనివాసరావు



రైల్వే స్టేషన్లో విస్తృత తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు పోలీసు శాఖ విశేష కషి చేస్తున్నట్లు జిల్లా ఎస్.పి కె.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా రైల్వేస్టేషన్, బస్టాండ్, హెూటళ్ళు, వాహనాలతో పాటు జనం రద్దీగా ఉండే ప్రాంతాలలో పోలీసులు విస్తత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ స్థానిక పోలీసులు విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ప్రజా శాంతికి భంగం కలిగించిన, మద్యం సేవించి వాహనాలు నడిపిన కఠిన చర్యలు తప్పవని మందు బాబులను ఎస్పి హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులపై పోలీసు అధికారులు సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతను మెరుగుపరిచేలా, నేరాల నియంత్రణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడేలా తనిఖీలు చేపట్టాలన్నారు. లాడ్జీ లలో పోలీసులు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, లాడ్జీ లలో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్‌లను పరిశీలిస్తూ లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను తనిఖీ చేసి, వారి గుర్తింపు వివరాలను నమోదు చేశారు. లాడ్జీలలో నిర్ధారణ లేకుండా బస చేస్తున్న వారిని, రిజిస్ట్రేషన్ లేకుండా గదులు కేటాయించే వారిపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఖాళీ ప్రదేశాలు, శివారు ప్రాంతాలలో, నగర శివారు ప్రాంతాలలో ,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపిన వాహనదారులపై కేసులు నమోదు చేయాల న్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ నందు ప్రయాణికుల భద్రతను దష్టిలో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగి ఉండే అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు.



ఎంపికైన పల్నాడు జిల్లా జట్టు

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా జట్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా జట్టు ను ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా,ఒంగోలు లోని డిఆర్పీ ఆనంద్ స్టేడియంలో మే31 నుంచి జూన్ 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ పోటీలు, సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఏక్విప్పెడ్ పోటిలకు పల్నాడు జిల్లా జట్టును ఆదివారం ప్రారంభించారు.

సబ్ జూనియర్ : 43కిలోలు కత్తి పల్లవి (గురజాల), 53కిలోలు కె.కార్తిక్ (గురుజల), 66కిలోలు ఎం.వినయ్ వెంకట శివ(సత్తెనపల్లి)

జూనియర్ విభాగం: 53 ఎం సాయి గగన్ (సత్తెనపల్లి), 74కిలోలు ఎన్ శరత్(కంకణాలపల్లి), 74కిలోలు పి. శ్రీహర్ష రమేష్ చౌదరీ (కంకనాలపల్లి), 83కిలోలు పసుపులేటి వంశీ కష్ణ (సత్తెనపల్లి), 120కిలోలు ఎల్ .శివ నాగేశ్వర రావు(గుడిపుడి) ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా సెక్రెటరీ పసుపులేటి సురేష్ , ప్రెసిడెంట్ జిమ్ రాజు, జీ రమేష్, కత్తి పవన్ కుమార్,ఎం రాహుల్ గౌతమ్, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య ఎంపికైన క్రీడా కారులను అభినందించారు..క్రీడాకారులను ఉద్దేశించి రాష్ట్ర స్థాయిలో పథకాలను సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు.

దావుపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని దావుపల్లి గ్రామంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం పొద్దుపోయే వరకు పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హార్టికల్చర్ అధికారి శ్రావణ్‌కుమార్‌ను పరామర్శించారు. శ్రావణ్ కుమార్‌తో పాటు గామపడ్డ శ్రీనునాయక్‌ను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ మధ్య వినుకొండ నియోజక వర్గం, శివాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యా భర్తలు జొన్నగిరి రామాంజి, అంకమ్మల కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ఆయన ధైర్యం చెప్పారు. రామాంజి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. పర్యటనలో ఎమ్మెల్యే వెంట కుర్రి శివారెడ్డి, రామాంజనేయ రెడ్డి, వజ్రం నాయక్, వెల్దుర్తి మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



జవహర్‌ను సన్మానిస్తున్న ఏపీ చర్మకారు సంఘం నాయకులు

జవహర్‌ను సత్కరించిన చర్మకార సంఘం నాయకులు

ప్రజాశక్తి - దుర్గి

కేఎస్ జవహర్‌కు ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించిన సందర్భంగా ఏపీ చర్మకారు సంఘం జేఏసీ నాయకులు ఆయనను సత్కరించారు. ఆదివారం ఆయనను కొవ్వూరులోని తన కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం చర్మకారు జేఏసీ సంఘం నాయకులు అందించారు. లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధి కొరకు ప్రభుత్వం చొరవ చూపాలని, రాష్ట్రంలో నిరుపయోగంగా పడి ఉన్న లిడ్ క్యాబ్ సంస్థ భూములను పరిరక్షించి వాటిని అభివద్ధి చేసే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ప్రభుత్వం దష్టికి తీసుకు వెళ్లి వీటకి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చర్మకారుల సంఘం జేఏసీ కన్వీనర్ నాగేశ్వరరావు, అభ్యుదయ చర్మకారు సంఘం నాయకులు కిషోర్ కుమార్ ,బాబు జగజీవన్ రావ్, శివ చిన్ని కృష్ణ, పల్నాడు జిల్లా సంఘం నాయకులు బిక్షాలు, మనోహర్, జోసెఫ్ పాల్గొన్నారు.

గ్రామీణులకు కార్పొరేట్ వైద్యం : మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - కొల్లిపర

గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం మండల కొల్లిపర సిహెచ్‌సిలో (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 822 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేని వారు, డబ్బులు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేనివారు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో కార్పొరేట్ స్థాయిలో లభించే వైద్య పరీక్షలు, సాధారణ శస్త్ర చికిత్సలు, స్త్రీల ఆరోగ్యం, పిల్లల వైద్యం, చెవి-ముక్కు-గొంతు, కంటి, దంత, గుండె సంబంధిత విభాగాలలో పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారని తెలిపారు. త్వరలో ఈ ఆరోగ్య కేంద్రంలో రక్త నిలకవల కేంద్రాన్ని ఏర్పాటు చేయునట్లు మంత్రి తెలిపారు అనంతరం నూతనంగా పింఛను మంజూరైన లబ్ధిదారులకు అర్హత పత్రాలను, గృహ నిర్మాణానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్



నాడీ పరీక్ష చేస్తున్న వైద్యులు కొండా వెంకటేశ్వర్లు

ఆయుర్వేద వైద్యం అనుసరణీయమైనది

ప్రజాశక్తి - పెదకాకాని

ఆయుర్వేద వైద్యం అందరికీ అనుసరణీయమైనది ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని అగతవరప్పాడు గ్రామంలో ఆదివారం ప్రాథమిక పాఠశాలలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గని వారి సమస్యలకు ఆయుర్వేదంలో దొరికే మందులు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.భాను, డాక్టర్ దగ్గుపాటి మౌనిక, ఆయుర్వేద వైద్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు ప్రశ్నలు.. రాజ్యాంగంపై మరో దాడి

ప్రజాశక్తి - గుంటూరు

తమిళనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలపకుండా ఏళ్ల తరబడి తొక్కి పెట్టిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ప్రశ్నలు సంధించటం సబబు కాదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈచర్య సుప్రీంకోర్టు తీర్పు నుండి కేంద్రం తప్పించుకో చూస్తుందన్న విమర్శల్ని ఎవరూ కొట్టిపారేయలేరని అన్నారు. వాస్తవానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగం యొక్క సమాఖ్య స్వభావాన్ని, రాష్ట్రాల హక్కుల్ని పరిరక్షిస్తూ ఆ తీర్పుని వెలువరించిందన్నారు. అలాంటి గొప్ప తీర్పుపై రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టుకి ప్రశ్నలు పంపటం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న మరో దాడిగానే మేధావులు, అభ్యుదయ వాదులు అభిప్రాయపడుతున్నారన్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతికి, రాష్ట్ర గవర్నర్లకు కాలపరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదన్నారు. ఆ తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 14 ప్రశ్నలు సందించటం సరికాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పులో ప్రధానంగా ఉపయోగించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 201, 202ల గురించే ఆ ప్రశ్నల్లో ఎక్కువగా ఉండటం ఆ తీర్పుని నిర్వీర్యం చేయడానికేనని అన్నారు.

మాజీ విఆర్ఓ కె.వి.రంగారావు మృతి

ప్రజాశక్తి - పెదకాకాని



మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన మాజీ కరణం కొండా వెంకట రంగారావు(74) ఆదివారం గుండెపోటుతో మరణించారు. కొండా వెంకట రంగారావు వెనిగండ్ల గ్రామ కరణంగా చాలా కాలం పనిచేశారు. అప్పటి ప్రభుత్వం మునసబు, కరణంల వ్యవస్థను రద్దు చేసి, మండల వ్యవస్థను ఏర్పాటుచేసిన తరువాత గ్రామ విఆర్ఓగా మండలంలోని పలు గ్రామాలలో పనిచేశారు. వెంకట రంగారావు మృతి పట్ల పలువురు నాయకులు, ఉద్యోగులు సంతాపం తెలియ జేశారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మంగళగిరిలో అదనంగా ఆసీల వసూళ్లు!

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి లో ఆసీలను రద్దుచేసి వ్యాపారులపై భారాన్ని తగ్గించిన విషయం విధితమే. అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు మాత్రం తమ పందా మార్చలేదు. వ్యాపారుల నుండి ఆసీల పేరుతో అనధికారికంగా నగదు వసూలు చేస్తున్నారు. మంగళగిరిలోనీ మాంసం చేపల మార్కెట్ నందు వ్యాపారుల నుండి రూ.100 నుంచి 150 చొప్పున ఆశీల కోసమని డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నారు. దీనికి సంబంధించి రసీదు అడిగితే ఇవ్వటం లేదని, ఎండలో వ్యాపారం చేసే తమకు కొద్దో గొప్ప మిగిలితే అందులోనూ ఆసీలు అంటూ వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని అదేమని అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారని ఓ వ్యాపారి ఆవేదం చెందాడు. ఐదు నెలల నుంచి ఇలాగే వసూలు చేస్తున్నారని మరో వ్యాపారి తెలిపారు. కార్పొరేషన్ అధికారులు దీనిపై వివరణ అడగ్గా తోపుడు బండ్లకు మాత్రమే ఆసిల్ మినహాయింపు ఉందని తెలిపారు. చేపలు అమ్మే వారి నుండి 30 రూపాయలు, మాసం దుకాణాల నుండి 50 రూపాయలు వసూలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇంతకంటే ఎక్కువగా వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీటికి కూడా రసీదు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అదనంగా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మట్టు పెట్టడమే కాకుండా దేశ ప్రజలకు భద్రతలపై భరోసా కల్పిస్తూ భారత్ సైన్యం చేసిన కృషిని అభినందిస్తూ సైనికులకు సంఘీభావంగా టిడిపి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మంగళగిరిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి పట్టణంలోని గాలిగోపురం సెంటర్ నుండి ప్రారంభమై పాత కూరగాయల మార్కెట్ వద్ద గల గాంధీ బమ్మ సెంటర్ వరకు జరిగింది. అందరూ జాతీయ పతాకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.అనురాధ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, అభివృద్ధిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు కుట్ర పన్నారని దానిని భారత సైన్యం తిప్పి కొట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, జె.బాలకృష్ణ, వాకా మాధవరావు, గోవాడ దుర్గారావు, మున్నంగి శివ శేషగిరిరావు, షేక్ రియాజ్, జి.ధనుంజయరావు, వి.ఆశాబాల, తోట పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నందిగం సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అంబటి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇసుకపల్లి రాజు అనే వ్యక్తిపై దాడి కేసులో అరెస్టయిన వైసిపి నేత, బాపట్ల మాజీ ఎంపి నందిగం సురేష్ ను పరామర్శించేందుకు వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు,తాడికొండ నియోజక వర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) ఆదివారం రాత్రి తుళ్లూరు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. సురేష్ వద్దకు వెళ్లేందుకు వారికి పోలీసులు అనుమతిం చలేదు. వర్షం కురుస్తుండడంతో రాంబాబు, డైమండ్ బాబు గేటు బయట గొడుగులతో నిలబడ్డారు. సురేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. సోమవారం సురేష్‌ను కోర్టుకు హాజరుప రుస్తారని భావిస్తున్నట్లు రాంబాబు చెప్పారు.

అవినీతి రహిత నియోజకవర్గంగా మంగళగిరి

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ మహానాడు ఆదివారం ఘనంగా జరిగింది. మహానాడులో మూడు తీర్మానాలను ఆమోదించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా చేయడం, అవినీతి రహిత నియోజకవర్గంగా మంగళగిరిని తీర్చిదిద్దడం, నియోజ కవర్గంలోని పార్టీ శ్రేణుల మృతికి సంతాప తీర్మాణాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. తీర్మానాలను జిల్లాస్థాయి మహానాడుకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ తెదేపా పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందన్నారు. ప్రజల సంక్షేమం ఓ వైపు.. రాష్ట్ర అభివృద్ధి మరోవైపుతో తనదైన ముద్ర వేసుకుంటుం దన్నారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ 82లో పార్టీ పెట్టి రాజకీయ విప్లవం, సామాజిక విప్లవం తెచ్చారన్నారు. పెత్తందార్లు, సంపన్నులు రాజకీయాల్లో ఏలుబడి సాగిస్తున్న రోజుల్లో ఎన్టీఆర్ అతి సామాన్యులకు టిక్కెట్లు ఇచ్చి శాసనసభకు పంపారన్నారు. గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీ పెట్టి పెనుమార్పు తెచ్చారన్నారు. కూడు, గూడు, నీడ నినాదంతో పేదలను ఆదుకున్నారన్నారు. నియోజకవర్గ మహానాడులో కార్పొరేషన్ డైరెక్టర్లు, టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు, నియోజకవర్గ నాయకులు, అన్ని మండలాల టీడీపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఎంపిటీసీలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.అనురాధ



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

166వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసంఎసిసి సిమెంట్ కంపెనీ కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 166వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు యూనియన్ నాయకులు, కార్యదర్శి కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ దీక్షలో కె.అంజయ్య, బి.సూర్యప్రకాష్, ఎం.శారద, వేముల లక్ష్మి, బొందలపాటి నవనీతం, కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ సిమెంట్ కంపెనీ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారావు, కార్మికులు ఎం.గురవయ్య, వై.సాంబయ్య, రమాదేవి, దుర్గాభవాని, ఇస్మాయిల్, ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ వద్ద మోకరిల్లుతున్న మోడీ

ప్రజాశక్తి - తాడికొండ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కబంధ హస్తాల్లో ప్రధాని మోడీ చిక్కుకున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. పొన్నెకల్లు గ్రామములోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గస్థాయి పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ. ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మోజులో పడి దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ట్రంప్ వద్ద మోకరిల్లుతుంటే మోడీ వద్ద జగన్, చంద్రబాబు నాయుడు ,పవన్ కళ్యాణ్ మోకరిల్లుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంధకారంలో అమరావతి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి గ్రామాల్లో ఆదివారం రాత్రి అంధకారం అలుముకుంది. రాత్రి 6 గంటల సమయంలో వర్షం మొదలైన కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పగలు ఎండ, ఉక్కపోతతో సతమత మవుతున్న ప్రజలకు రాత్రి వేళ కరెంట్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. గాలులు ఉధృతంగా లేకపోయినా కొద్దిపాటి వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.ఎప్పుడు కరెంట్ వస్తుందో తెలియని పరిస్థితి. పేరుకు రాజధాని.. అయినా కరెంట్ కష్టాలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. కరెంట్ లేకపోవడంతో సమయానికన్నా ముందుగానే దుకాణాలు మూసివేయాల్సి వస్తోందని వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఐఆర్ఎస్ అధికారి ఆనంద కుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వవిద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మారీస్ పేట తాలూకా బ్రాంచి హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం పెన్ననర్ల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ జిఎస్టి కమిషనర్ పి.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యమిత్ర పేరిట పది సంవత్సరాలుగా ప్రతి ఏటా పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో గద్దె శంకరరావు, పాండురంగారావు, అన్నవరపు సురేష్, దేసు లోకేశ్వరరావు టి.శరత్, అంగరేకుల ప్రసాద్, ఎం. సత్యనారాయణ, భాస్కర్, కలాం పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి - గుంటూరు

పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో డీఈఓ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. ఆదివారం జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఐక్యవేధిక నాయకులు జిల్లా స్టీరింగ్ కమిటీ బాధ్యులు కె.బసవలింగారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బసవలింగారావు, ఎమ్.కళాధర్, డి.కె.సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు గొడ్డపెట్టు అయిన జీఓ 117 రద్దు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి అంతకన్నా ప్రమాదకరమైన జీఓ 19, జీఓ 21 విడుదల చేసి, 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేయటం ఉపాధ్యాయుల్ని మోసం చేయటమేనని అన్నారు. ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుండి 5వ తరగతులు, ఉన్నత పాఠశాలలో 6 నుండి 10 తరగతులు ఉండాలని, ఫౌండేషన్ పాఠశాలల ఏర్పాటును అంగీకరించబోమన్నారు. ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాల్సిందేనన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంభంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఎస్‌జిటిలను ఇవ్వాలని, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 1:20గా ఉండాలన్నారు. బేసిక్ గానీ మోడల్ ప్రాథమిక పాఠశాలలు తప్ప ఫౌండేషన్ పాఠశాలల ఏర్పాటుకి ప్రభుత్వం మొండిగా ముందుకెళితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 21న ఉమ్మడి జిల్లాల డిఇఒ కార్యాలయాలు, 23న పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయాన్ని ముట్డడి చేస్తామన్నారు. సమావేశంలో గుంటూరు జిల్లా నాయకులు జి.వి.రాజు, యు.రాజశేఖరరావు, మహమ్మద్ ఖాలీద్, కె.శ్రీనివాసరావు, కొండయ్య, రెహమాన్, పల్నాడు జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, బాపట్ల నాయకులు ఎ.శ్రీనివాసరావు, జ్ఞానేశ్వరరావు, మూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా పవర్ లిఫ్టర్ల ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఫిట్ జోన్ జిమ్ సెంటర్లో ఆదివారం గుంటూరు జిల్లా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ (మెన్ & ఉమెన్) మరియు బెంచ్ ప్రెస్ చాంపియన్షిప్ ఎంపిక (సెలక్షన్) పోటీలు జరిగినవని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధానిలు తెలియజేశారు. ఈ సెలక్షన్ పోటీలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా మహిళా పవర్ లిఫ్టర్స్ 15 మంది, మెన్ పవర్ లిఫ్టర్స్ 11 మంది మొత్తం 26 మంది హాజరయ్యారు, వారిలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ మెన్ & ఉమెన్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ టీమ్‌లను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31నుండి జూన్ 2వ తేదీ వరకు ఒంగోలులో జరిగే ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ (మెన్ & ఉమెన్) ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారని తెలియజేశారు.



డీఎస్సీలో పోస్టులు తగ్గవు

జిల్లాలో పాఠశాలల రేషనలైజేషన్ వల్ల డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల సంఖ్య ఏమాత్రం తగ్గదని జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక తెలిపారు. ప్రతి పంచాయతీలో మోడల్ పాఠశాల ఉండాలన్న ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రాథమిక స్థాయిలో ఒకటి నుంచి ఐదు వరకు ఒక పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. 'ప్రజాశక్తి ప్రతినిధి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

- ప్రతి పంచాయతీతో మోడల్ పాఠశాల
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపునకు కృషి
- నేటి నుంచి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు
- 'ప్రజాశక్తి'తో గుంటూరు డిఇఒ సి.వి. రేణుక



పాఠశాలలలో మార్పుల వల్ల డిఎస్‌సిలో ఖాళీలు తగ్గుతాయా?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1143 పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ పోస్టులకు ఎటువంటి ఢోకా లేదు. రేషనలైజేషన్ వల్ల మిగులు పోస్టులు స్వల్పంగా తగ్గుతాయి. దీని వల్ల అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఉమ్మడి జిల్లాలో ఎన్ని మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.?

ఉమ్మడి జిల్లాలో 3139 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 711 పంచాయతీల్లో మోడల్ పాఠశాలలు ఏర్పాటు అవుతాయి. పాఠశాలల భవనాలు, అన్ని వసతులు వున్న వాటిని గుర్తించాం. ఈమేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి మోడల్ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఈ పాఠశాలలు ఏర్పాటు అవుతాయి. గతంలో హైస్కూల్సులో విలీనం అయిన 3,4,5 తరగతులను కలిపి ఇప్పటికే ఉన్న ఒకటి రెండు తరగతుల విద్యార్థులతో కలిపి మోడల్ పాఠశాలను ఏర్పాటు చేయనున్నాం. ప్రతి పాఠశాలకు 30 నుంచి 60 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉంటారు. అంతకంటే ఎక్కువ ఉంటే మరొకరు కూడా ఉంటారు. అలాగే ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్సులో 60 మందిపైన విద్యార్థులు ఉంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉంటారు. అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండేలా రేషనలైజేషన్ చేశాం. అవసరమైన చోట మరొకరు కూడా కేటాయిస్తాం. అలాగే జిల్లాలో 56 అప్పర్ ప్రైమరీ పాఠశాలలను హైస్కూల్సుగా మార్చి వీటిలోల కూడా ఆరుగురు ఉపాధ్యాయులు ఉండేలా చేస్తున్నాం. ఇప్పటికే మిగులు ఉపాధ్యాయులు ఉన్నారని వీరిని సర్దుబాటు చేస్తున్నాం. అంతేతప్ప డిఎస్‌సి నోటిపికేషన్ ఖాళీలు యధాతథంగా కొనసాగుతాయి. డిఎస్‌సిలో 1143మంది ఎంపిక అవుతారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు?

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా షెడ్యూలు విడుదల కాలేదు. మే 31 నాటికి ప్రస్తుతం నిబంధనలు ప్రకారం పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రాథమిక జాబితాల ను రూపొందించాం. సెకండరీగ్రేడ్ టీచర్లు, తత్సమాన కేడర్ల నుంచి స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియారిటీ జాబితాను తమ వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. ఇందుకు సంబంధించిన ఉపాధ్యాయులు సోమవారం లోగా తమ అభ్యంతరాలు తెలియజేయాలని కోరాం.

టెన్తు సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లు?

జిల్లాలో టెన్తు అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలకు 4248 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సోమవారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల్లో తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు జరిగే ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు తగిన సమయానికి నడపాలని ఆర్‌టిసి అధికారులను కోరాం. విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ఇచ్చే సమయంలో ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం.

కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు ప్రవేశాలు?

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు సంబంధించి ఈనెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది. మండల విద్యాశాఖ అధికారులు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై విస్తృత ప్రచారం కలించారు. 19వ తేదీలోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రతి కూల పరిస్థితులను ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తాం. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, స్టేట్ సిలబస్‌లో చదివేందుకు పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత కలిగిన వారంతా దరఖాస్తులు చేసుకోవచ్చు. వీరికి లాటరీ ద్వారా ఈనెల 29న సీట్లు కేటాయిస్తాం.

పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా

రెండో రోజుకు చేరిన కబడ్డీ పోటీలు



పోటీలలో తలపడుతున్న జట్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించు కొని యు వజన (డివైఎఫ్ఐ), విద్యార్థి (ఎస్.ఎఫ్.ఐ)సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తూర్పు మాల పల్లెలో జరుగుతున్న ఈ కబడ్డీ పోటీలు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన 9వ వార్డు మద్దినగర్ సచివాలయం పోలీస్ లేడీస్ కానిస్టేబుల్ అంజనీ దేవి పాల్గొని మాట్లాడుతూ ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదకర వాతవారణంలో జరగటం సంతోషం అన్నారు క్రీడల్లో తగిన విధంగా రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు రావడమే కాకుండా భవిష్యత్తుకు బంగారు బాట ఏర్పడుతుందన్నారు. ఇటువంటి క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా కారులను పరిచయం చేసుకుంటూ ప్రతి వారిని పేరు పేరునా పలకరించారు. అందునా కామ్రేడ్ పుచ్చలపల్లి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సచివాలయం లేడీ కానిస్టేబుల్ అంజని దేవి

సుందరయ్య వర్ధంతి సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలు ఉద్యమ స్ఫూర్తినిస్తాయన్నారు.. ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలలో మొత్తం 8 టీములు పాల్గొ న్నాయి. ఈ పోటీలలో పాల్గొన్న ఫిరంగిపురం దాచేపల్లి విను కొండ గుంటూరు సత్తెనపల్లి పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర ఊర్ల నుంచి వచ్చిన టీములు పాల్గొని మ్యాచ్‌లు ఆడా యన్నారు.



పోటీలను తిలకిస్తున్న ప్రజలు

శనివారం జరిగిన పోటీలలో చిలకలూ రిపేట సుగాలి కాలనీ టీమ్ సెమీ ఫైనల్ వచ్చాయి. విళ్ళ ల్లో గెలిస్తే వారు సెమి ఫైనల్‌లో రెండు టీమ్ లు ఆడు తా రని కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం జరిగే ఆటలకు అంపైర్ గా అనిల్ కుమార్, నాదేంద్ర బాబులతో పాటుగా తాటిమల్లు, శేఖర్, లైన్ ఎంపైర్‌గా బొంత నవీన్, మాణిక్య రాజు వ్యవహరిస్తారన్నారు. న్యాయ నిర్ణీతలుగా సాతులూరి సురేంద్ర, సాతులూరి హనుమంతరావు, సాతులూరి ప్రకాష్, సాతులూరి బెంజిమెన్లు వ్యవహరిస్తారన్నారు. ఆటకు 40 నిమిషాల పరిమితి అన్నారు. స్థానిక తూర్పు మాలపల్లిలోని చంద్రమౌళి పార్క్ క్రీడా మై దానంలో సోమవారం నాటితో ముగియనున్నాయన్నారు. సోమవారం కూడా పాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రి మ్యాచ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి జట్టులో 12 మంది క్రీడాకారులు మాత్రమే ఉండాలని ఒక జట్టులో క్రీడాకారుడు మరో జట్టులో ఆడేందుకు వీలు లేదన్నా రు. క్రీడాకారుడు 85 కేజీల బరువు మించరాదని తెలిపారు. నిబంధనలకు లోబడి విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. 19వ తేదీన నిర్వహించనున్న కామ్రేడ్ సుందరయ్య వర్ధంతి సభలో ప్రథమ బహుమతిగా 20000 ద్వితీయ బహు మతిగా 15000, తృతీయ బహుమతిగా 10000, నాలుగవ బహుమతిగా 5000 రూపాయలను అంద జేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పేరు బోయిన వెం కటేశ్వర్లు, ప్రజానాట్య మండలి సీనియర్ నా యకులు ఎన్. కాళిదాసుతో పాటుగా పోటీలకు మాజీ క్రీడా కారులు, పట్టణ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. ముందుగా ఐటీసీ పొగాకు ఉద్యమ నాయకులు 25 మందిని స్మరించుకుంటూ పూలతో ఘన నివాళులర్పించారు. కబడ్డీ పోటీలు రెండు రోజులు కామెంట్రీ సాతులూరి బెంజిమెన్ చేశారు.